కథ

# ఉద్యోగపర్వం

వి.ఎం.ఎస్. స్వాతి

ఆఫీసు అంటే?

టేబుళ్ళు, కుర్చీలు, ఉద్యోగులు, తిరుగుతుండే ఫ్యాన్లు, అదే స్పీడ్‌లో వచ్చే పోయే పార్టీస్...

ఓహ్!

ఎంత హంగు...

ఎంత రాజకీయం...

అయితే ఒకటుంది.


కళకళలాడే మొహాలతో, ట్రిమ్ డ్రెస్సులతో, అవర్గళ ఆంగ్లభాషా ప్రవాహంతో మొత్తం మీద ఆఫీసుల వాతావరణమే అదో విధంగా కనిపిస్తుంటుంది.

అది రాష్ట్ర ప్రభుత్వాఫీసు కానీ, కేంద్ర ప్రభుత్వాఫీసు కానీ, ప్రైవేటు ఫరమ్ కానీ...

'వైట్ కాలర్ జాబ్స్' అంటారు వీటివే.

వేసుకున్న బట్టలు, ఒళ్ళు నలగని ఈ తరహా ఆఫీసు ఉద్యోగాలపై చదువుకున్న వారంతా మోజు పడుతుంటారు.

వీటిలో పెన్షనబుల్స్, నాన్–పెన్షనబుల్స్ అనే విభాగా



ఉన్నాయి. వారి వారి స్పెషలైజేషన్స్ బట్టి ఆయా కొలువులు, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ చుట్టూ ఉద్యోగాన్వేషణలు, పేపర్ అడ్వర్టయిజ్‌మెంట్స్ బట్టి ఉద్యోగాలకు అప్లై చేయడం. తెలిసిన డిపార్ట్‌మెంట్‌లో మధ్యవర్తులకు లంచాలిచ్చి ఉద్యోగాలు సంపాదించడాలు.

ఓ జూ..

ఓ సర్కస్...

ఓ గారడీ...

మానవుల, జంతువుల రకరకాల విన్యాసాలెన్నింటినో తలపింపచేస్తుంటాయి ఆఫీసు వాతావరణాలు.

సోడా బుడ్డి కళ్ళద్దాల ముసలి నక్కల నుంచి, అప్డేట్ షోకిల్లా కుర్రకారు ఉనికితో ఆఫీసులంటేనే ఓ ప్రత్యేక లోకం!

ఇందులో జీతాలు క్రమంగా ఇచ్చే డిపార్టుమెంట్స్, నెల తరబడి జీతాల బకాయిల డిపార్ట్‌మెంట్స్. జీతాలు పదో తేదీ దాటాక కానీ ఇవ్వని ఆలస్యం డిపార్ట్‌మెంట్స్...

బస్కీలు, శీర్షాసనాలు, జాగింగ్‌ల పరంపర. ఎక్సర్‌సైజుల మాదిరి ఈ నానా పక్షీల ఆఫీసు వాతావరణంలోకి కొత్త పక్షి వాలిందండోయ్!

ఐ మీన్ న్యూ ఎంప్లాయి!

మిస్టర్ కోదండం – టైపిస్ట్.

టైప్ చేసివ్వాల్సిన ఫైల్లో మేన్యు స్క్రిప్ట్. ఇంగ్లీషా లేక ప్రాకృతమా అన్నంతగా గజిబిజిగా కనబడి కళ్ళు తిరగసాగాయి కొత్త పక్షికి.

"మిస్టర్ దండం!"

"హలో సార్!"

ఈ విధమైన సీనియర్స్ పిలుపులు ఆ పక్షి అసలు పేరు మరచిపోయేలా చేస్తుంటే–

నవ్వ లేక, ఏడవ లేక ఆ గందరగోళాన్నంతా టైప్ మిషన్ కీ బోర్డు మీద ప్రతిఫలింపజేయసాగాడు.

ఫలితంగా "లైనుకి ఇన్నేసి తప్పులా?"

"ఇంతగా మార్జిన్ తగ్గిస్తే లెటర్ చూడ్డానికే బాగాలేదు..."

"స్పెల్లింగ్ మిస్టేక్స్ చాలా వున్నాయే...!"

ఇలా చురకలేసే వాళ్ళపై విరుచుకుపడలేడు పర్మనెంట్ ఎంప్లాయి కాదు కాబట్టి.

ఒక వేళ తమ హద్దు మీరితే అంతా కట్టగట్టుకుని పోయి ఆఫీసరుకి కంప్లయింట్!

ప్రొబేషనరీ పీరియడ్ సంతృప్తికరంగా ముగియకపోవడం...

ఇవన్నీ దాటాలంటే ఎవరేమన్నా పట్టించుకోకుండా, బిక్కు బిక్కుమంటూ తన పని తాను చేసుకుపోవడమే!

ఎప్పుడు బదవుతుందా? ఎప్పుడు ఆఫీసు నుంచి బయట పెడదామా! అని బెదురు బెదురుగా మసలే కోదండం అవస్థ అంతా ఇంతా కాదు.

జాబ్‌లో కొత్తగా జాయినైనవారంతా ఈ బాపతే అయినా కోదండం మరీ సున్నిత మనస్కుడు. ఎవరేమన్నా సహించలేడు. కన్నీళ్ళొచ్చినంత పనైపోతుంటుంది.

ఇంటి దగ్గర అయిన వారి విమర్శలకే అదోలా మొహం పెడతాడు.

ఈ నేపథ్యంలో ఆఫీసులో బేలగా, పిరికిగా మసలుతుంటే స్టాఫ్ దృష్టిలో ఎంత చులకన?

'నేరక ఈ పోస్ట్ మనుషుల మధ్య వచ్చి పడ్డాను. సాగినంత కాలం ఇక్కడ ఎడ్జెస్ట్ కాగలనా?' కోదండం మనసులో సంకోచం. బెరుకు.

అతడి మనసులోని ఈ బెరుకునంతా ఓ కంట గమనిస్తోంది సలలిత.

ఆమె ఆఫీసులో పి.ఏ.

"చూడు తమ్ముడూ! మగాడివిగా వుండి ఇంత భయం భయంగా వుంటే నలుగురి మధ్య నెట్టుకు రాలేవు. డేరింగ్ అండ్ డ్యాషింగ్‌గా వుండి కష్టాలు, అవమానాల్ని చిరునవ్వుతో ఎదుర్కొగలిగితేనే సీనియారిటీ సాధించేది! వర్క్‌లో క్వాలిటీ పెరిగేది!...." ఇలా ఆమె అడపాదడపా బోధిస్తుండడంతో–

"ఆ కొత్త బిచ్చగాడి పైన ఈ బ్యూటీ కన్ను గానీ పడిందా ఏమిటి? నాకెంత అనుభవముంది ఈ విషయంలో! అలాంటి నన్ను కాదని ఆ కొత్త కంగారు గాడితో చేయి కలిపి ఏం బావుకుంటుందో?" ఇదీ శుభాకర్ బాధ. అతగాడామెకు వల వేస్తే ఒడిలో వాలడం లేదు.

"భార్యా పిల్లల్ని పెట్టుకొని మనాఫీసులో కొన్ని గుంట నక్కలు తిక్క తిక్క వేషాలు వేస్తున్నాయి" అనామె తన కొలీగ్ సుప్రజతో ఇన్‌డైరెక్ట్‌గా తనను తిట్టడం, ఏ ట్రయలూ లేకుండానే కోదండానికి దగ్గర కావడమూ సహించలేక పళ్ళు కొరుకుతూ వున్నవీ లేనివీ కల్పించి కోదండం టైప్‌లో తప్పుల్ని భూతద్దంలో చూపి మరీ విసుక్కోసాగాడు శుభాకర్.

మిగతా స్టాఫ్‌కు, ఈ శుభాకర్‌కు మధ్య ఇంత తేడా ఎందుకో తెలియని కోదండం మనస్తాపం చెందుతూ రాత్రుళ్ళు నిద్రకు దూరమవుతూంటే–

"ఏరా! ఉద్యోగంలో చేరావన్న మాటే గాని నీ ముఖంలో ఆనందం ఏ కోశానా కనిపించడం లేదు" అంటూ అక్కయ్య జానకి ఒక రోజు నిలదీసింది.

"పర్సనల్‌గా కాదు గానీ అఫీషియల్‌గా మాటలు చాలానే పడాల్సి వస్తోంది. ఆ గిల్టీనెస్ ఇంకా తప్పులు పెరిగేలా చేస్తోంది" తమ్ముడి జవాబుకు చిన్నగా నవ్వేసిందామె.

"తానొవ్వక, పరుల నొప్పించక తప్పించుకు తిరుగువాడే ధన్యుడు సుమతీ– నేను కొత్త కదా సార్! తప్పులు చేయడం సహజం. ఇకపై సరిదిద్దుకుంటాను అనే ధోరణిలో వుండు. వాళ్ళు తగ్గుతారు. సహకరిస్తారు. అలా కాక పల్లెటూరి బైతులా ప్రతి దానికీ ఏడుపు మొహం పెట్టేస్తుంటే వాళ్ళింకా ఏడిపించాలనే చూస్తారు. ఇలా అంటున్నానని బాధపడకు. మగాడివి. ధైర్యంగా అవమానాలు తట్టుకోవాలి" అంటూ హితబోధ చేసింది.

"మా ఆఫీసర్ పి.ఏ. సలలిత కూడా ఇలాగే ఎంకరేజ్ చేస్తుంటుందక్కా. 'తమ్ముడూ' అని పిలుస్తుంటుంది. ఆమె పి.ఏ. అయినా హుందాగా ప్రవర్తిస్తుంటుంది. ఎవరితోనూ వెకిలిగా మాట్లాడ్డం నేనెరుగను".

"అది ఆడపిల్లలకుండే ముందు జాగ్రత్త! అనుభవం నేర్పిన నడక. మనింట్లో అందరికీ పెళ్ళిళ్ళయ్యాయి. మిగిలింది నువ్వే. ఉద్యోగస్తుడివయ్యావు కాబట్టి ఒక ఇంటివాడివైతే మన అమ్మా నాన్నల బాధ్యత తీరుతుంది. నాకూ ఆడపడుచు రావాలనే ఆశగా వుంది".

"సర్లే! ముందు నన్ను జాబ్‌లో నిలదొక్కుకోనీ! పెళ్ళికిప్పుడేం తొందర?"

"ఈ మాట నా దగ్గరంటే అన్నావ్! ఇంకెక్కడా అనకు. నిన్ను శంకిస్తారు. ఈ రోజుల్లో మగవాళ్ళెంత ఫాస్ట్‌గా వున్నారు! ఏదేనే! మంచి వారికెప్పుడూ మంచే జరుగుతుంది. కల్యాణమొచ్చినా; కక్కొచ్చినా ఆగవన్నట్టు నాకు ఆడపడుచుతో పరాచికాలాడే రోజు రాకపోదులే..!"

ఇలా ఇంట్లో అక్కయ్య, ఆఫీసులో సలలిత హితవులతో మెల్లమెల్లగా లైన్లోకి రాసాగాడు కోదండం. తనపైన నమ్మకం పెరగసాగింది.

చేస్తున్న జాబ్‌లో క్వాలిటీ ఆటోమేటిగ్గా కన్పిస్తోంది.

ఇకనేం?

ఆఫీసు వాతావరణానికి అలవాటుపడసాగాడు.

అదే ఆఫీసులో ఓ పెద్దాయన రిటైరయ్యారు. ఆ సీటుకు కొత్తగా రిక్రూట్ అయ్యాడు వనమాలి అనే కుర్రాడు.

అతను కోదండమంత బెరుకు మనిషి కాకున్నా ఆఫీసర్ చేతా, స్టాఫ్ చేతా పరంపరగా చీవాట్లు తినడం తప్పించుకోలేక పోతున్నాడు.

అతగాణ్ణి చూస్తుంటే కోదండానికి ఓ సత్యం బోధపడింది.

కొత్తొక వింత, పాత ఒక రోత నానుడిని ఈ ఆఫీసులో తిరగమార్చి చదువుకోవాలి. కొత్త కోడలికి అత్తా మామలంటేనే హడల్! భర్తైనా తన కనుసన్నల్లో మనిషేనన్న భరోసా. ఈ ఆఫీసులో పాత స్టాఫ్ కొత్త స్టాఫ్‌కు అత్తామామలుగా కనిపిస్తుంటారు! దానికి తగ్గట్టే పాత స్టాఫ్ అజమాయిషీనూ..!